రామన్ని చంపాలి

రచన శార్వాణి

"ఏమండోయ్ ! మిమ్మల్నే !"

"............"

"వినిపించుకోని, పల్కరించరేం ?"

"............"

"పల్కరిస్తే నోటి ముత్యాలు రాలిపోతాయా ?"

"............"

"రెండు ఆత్మలూ ఒకటే అనీ, ఆకసం ఒరిగినా, భూమి విరిగినా, సముద్రం తరిగినా, మనం ఎప్పుడూ విడిపోమనీ ప్రమాణం చేశారు. మరచి పోయారా గర్భగుడిలో దేవుడిముందు."

"............"

"పోనీ పగలు విడిపోయినా, రాత్రులుకూడా ఇదేమి కర్మమండీ !"

"............"

"ఇంత అర్ధ రాత్రి ఆకాశం నిండా నక్షత్రాలు, భూమి మీద పుచ్చపువ్వులాగ వెన్నెల, విరబూసే జాజి లతలనుంచి సౌరభం, నన్ను విసుగెత్తిస్తున్నాయి."

"............"

"నాలుక పిడచ కట్టుకొని పోతోంది. అరచి అరచి ప్రాణాలు పోతున్నాయి. అబ్బబ్బ ! ఒక్కసారి ఇటు మొఖం త్రిప్పండి."

".... ... ..."

"ప్రపంచమంతా మనదేదో ఆదర్శ దాంపత్యమని అనుకుంటోంది. ఉన్న విషయం తెలిస్తే నవ్వరా ?"

"ఏమిటీ గోల. ఒకటే కాకిగోల. మంచి సస్పెన్స్‌లో ఉంటే. పానకంలో పుడకలాగ."

"తిక్క ఇప్పుడు తిరిగిందన్నమాట. ఏమిటా చచ్చు పెన్ను."

"కాస్సేపు నిశ్శబ్దంగా వుంటే నీకు పదివేల నమస్కారాలు."

"కాస్సేపు కాస్సేపని 8 గంటలనుంచి అంటున్నారు."

"ఐపోవచ్చింది. రామన్ని చంపేస్తున్నా."

"ఏ రామన్ని. మన ఇంటికి రోజూ వచ్చే మీ స్నేహితుడు. అతన్ని చంపేస్తున్నారా ? మీకేమైనా మతి పోయిందా ? లేకపోతే మేలుకొనే పలవరిస్తున్నారా ? ఈ విషయం పోలీసులకు తెలిస్తే ఇంకేమైనా ఉందా ? పండులాంటి సంసారం నట్టేట్లో కలుస్తుంది."

"... ... ..."

"ఎందుకట్లా నవ్వుతారు ? మీ మనస్సు ఎట్లాగ ఒప్పు కుందండీ ? మీ కాళ్ళు పట్టుకుంటానుగాని అటువంటి పనులు చేయకండి. అయినా అతడు మిమ్మల్ని ఏంచేశాడని ?

"... ... ..."

"ఇంకా నవ్వుతూనే ఉన్నారా ? మీకు నిజంగా మతి పోయి ఉంటుంది. మీ వాలకం చూస్తూంటే నన్నుకూడా చంపేటట్లున్నారు."

"ఎందుకట్లా అరుస్తావు. చంపేది మన రామన్ని కాదే, మన కథానాయకుడు రామన్ని. ఇంతలో ఎంత రాద్ధాంతం చేశావు?"

"మీ రిటువంటి కథలు వ్రాసే, కొంపకు నిప్పు అంటిస్తున్నారు. మా నాన్న మీకేమి అపకారం చేశాడని, అచ్చం నిజం పేరు పెట్టి ఇష్టమొచ్చినట్లు వ్రాశారు. ఊళ్లో వాళ్ళంతా ఏమైపోతే మీకెందుకు ?"

"ఈ ఊళ్లో మా మామయ్యలాంటి మామయ్యలు చాల మంది ఉన్నారు. వాళ్ళంతా కాషాయి వస్త్రాలు ధరించి, చక్కగా శ్రీరంగ నీతులు బోధిస్తూ, ప్రపంచంలో పెద్ద మనుష్యులుగా ప్రవర్తిస్తూ మోసం చేస్తుంటారు. అటువంటి పయోముఖవిషకుంభ జీవితాలను రచ్చ కీడ్చి, బుద్ధి వచ్చేటట్లు చేయాలి."

"లేకపోతే మీకు రాబోయే కట్నం పోతుంది. అంతేనా ?"

"తండ్రికి తగ్గ కూతురివి. చిన్నప్పట్నుంచి ఒకే కంచంలో తింటూ ఒకే మంచం మీద పెరుగుతూ, అన్యోన్యంగా ఉన్న అనుబంధాన్ని వేరు చేయాలని మీ నాన్న ఎందుకు ప్రయత్నించాడు ? నేను దరిద్రుణ్ణనేగా ? ఒకరి హృదయాలు ఒకరు అర్థంచేసుకొని, రాగానుబంధాలను పెంచుకొని, పెళ్ళి చేసుకోవాలని చెప్పినరోజు, మీనాన్న అగ్గిరాము డయ్యాడు. తోక తెగిన నల్లకోతి లాగ గంగిరెత్తాడు. విడిపోనటువంటి జీవితాలను వేరు చేయాలని పన్నాగాలు పన్నుతున్న మీ నాన్న జీవితాన్ని ఉన్నదున్నట్లు వ్రాయడంలో తప్పేముంది ?"

"తప్పా ? తప్పున్నరా ! మీరు గొప్పవారనిపించుకోవడానికేనా ఈ ప్రయత్నం. చాల్లెండి. నా కటువంటి రాతలంటే వళ్లు మంట."

"అంత వళ్ళు మంటగా ఉంటే మూడవ పంచవర్ష ప్రణాళికలో ఒక ప్రాజెక్టు కట్టించు. సముద్రంలో కలవకుండా, ఆ నీరంతా మీ ఇంట్లోకే వస్తుంది. శరీరం చల్లబడుతుంది."

"మా నాన్నంటే మీకంత వెక్కిరింపుగా ఉంది. మా నాన్న తలుచుకుంటే ఏమైనా చేయగలడు."

"ఒక్కటడుగుతాను చెప్పు. అంత ఘనుడైతే నీ మనస్సు మార్చగలడా ?"

"... ... ..."

"మాట్లాడవేం."

"ఏదో గారడీ చేసి, మా నాన్న కళ్ళకు కారంకొట్టి, బుట్టలో వేసుకున్నారు."

"నా కాలాన్నంతా దుర్వినియోగం చేస్తున్నావు. కాస్త కథ వ్రాసుకోనియ్యి."

"నిజంగా మీ కథానాయకుణ్ణి చంపేస్తున్నారా ? నా కెందుకో ఏడుపు వస్తోందండీ !"

"ఏడుపు వస్తుందని ఎవరూ అనరు. ఏడుస్తారుగాని. సరి... కొంపదీసి మాకథానాయకుణ్ణి ప్రేమించలేదుకదా?"

"అటువంటిది జరిగితే, మీ కథానాయకుడి ప్రాణం అటుంచి, ముందు నా ప్రాణం తీస్తారు."

"నిన్ను ఒక్కటడుగుతాను. నిజం చెబుతావా ?"

"మీదగ్గర ఎప్పుడైనా అబద్ధాలాడానా ! మీరే అప్పుడప్పుడు కక్కుర్తి పడతారుగాని"

"ఇంతవరకు వ్రాసిన కథ చదివేవు కదా ! రామం మీద నీ అభిప్రాయం ?"

"నేను చదవలేదు. బలవంతంగా మీరే చదివి వినిపించారు."

"అబ్బ ! చంపక చెపుదూ !"

"నిర్మొహమాటంగా నిజం చెప్పమంటారా ?"

"నిజం కావాలి. అసలు నేను బ్రతికేది నిజంకోసమే! నిజం కోసం పుట్టాను, నిజం కోసం బ్రతుకుతున్నాను. నిజం కోసం ప్రాణాలు ధారపోస్తాను."

"సత్య హరిశ్చంద్రు లయితే అయ్యేరుగాని, మీ నిజాన్ని నిలబెట్టుకోవడం కొరకు నన్ను మాత్రం ఎవరికీ చంద్రమతిలాగ విక్రయించకండి. మా నాన్న సంగతి మీకు బాగా తెలుసుగా !"

"ఆ యమధర్మరాజు గురించి చెప్పకపోతే, నా కథ గురించి చెప్పకూడదూ ?"

"చదువుకున్న ఏ ఆడదీ మీ కథల్ని మెచ్చుకోదు"

"ఎందుకని ?"

"పెళ్ళి కాని ఆడ పిల్లలు నీతికి దూరమవుతారేమోనని."

నా కథా నాయకుణ్ణి పెళ్ళికాని పిల్లలంతా ప్రేమిస్తా

రంటావు. శభాష్! అదే నాకు కావలసింది. అందుకనే కథానాయకుణ్ణి చంపేస్తున్నాను."

"మీ తెలివి తెల్లవారినట్లుంది. అతడు మిమ్మల్ని ఏంచేశాడని అతన్ని చంపుతానంటారు."

"వేరే శరణ్యంలేదు."

"కథల్లో అందర్నీ చంపుకు తింటారు. ఇది మన సంసారానికి ఎంత మాత్రం శుభం కాదు. మొన్న పత్రికలో పడిన 'కలియుగ సమాప్తి' కథలో అందర్నీ ఏకమొత్తంగా తుదిముట్టించారటగా. పక్కింటావిడి కళ్లు ఒత్తుకుంటూ కూర్చుంది. ఆ కథ చదివిన తర్వాత మీ కామె ఏమి పేరు పెట్టిందో తెలుసా?"

"పిస్తోల్ శ్రీ"

"ఫిరంగ్ నాథ్"

"కాదు"

"అణ్వస్త్ర శాస్త్రి"

"అసలే కాదు"

"నీ తలకాయ- నా తలకాయానూ."

"ఎందుకట్లా ఉడికిపోతారు? 'కలియుగ బ్రహ్మ' అంది."

"ఇంకా నయం. 'బ్రహ్మకపాలం' అనలేదు."

"అన్నట్లు మీ కథానాయకుణ్ణి దేనితో చంపుతున్నారండి. కథానాయకురాలు, అతని ప్రేమను తిరస్కరించి, మరొకణ్ణి ప్రేమించి వివాహం చేసుకుందని, ఆ బాధను పడలేక పిరికి పందలాగ ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటున్నాడా? పాపం! మీ కథానాయకుడికి ఎంత గతి పట్టింది."

"ఆత్మహత్య కాదే! ప్రాణత్యాగం."

"నల్లమందుతోనేనా."

"నన్ను విసుగెత్తించి నా కథంతా చెడగొట్టాలని చూస్తున్నావు."

"నన్నుకూడా అంతే చేస్తున్నారుగా. చిలకా గోరవంకల్లాగ సలక్షణంగా ఉండక, ఇంత అర్ధరాత్రి ఈ మద్దెల మేళమేమిటి? మిమ్మల్ని చూస్తూంటే కంపరమెత్తుతోంది."

"అవును. నా కథలవల్ల అభ్యుదయం రూపొందుతుంది. విజ్ఞానం పెరుగుతుంది."

"అని మీరనుకుంటున్నారు."

"నేను అనుకోవడ మేమిటి? పాఠకుల దగ్గరనుంచి వచ్చిన ఉత్తరాలు ఋజువుచేస్తాయి."

"వాళ్ళంతా మీబోటి కథల పిచ్చివాళ్ళు."

"అయితే ఆడవాళ్ళు వ్రాయవలసినపని ఏమివచ్చింది. ఒకామె ఏమి వ్రాసిందో తెలుసా?"

"ఇటువంటి పిచ్చి పిచ్చి కథలు వ్రాస్తే, పరువునష్టపు దావా బనాయిస్తానంటుంది. అంతేనా!"

క్రిందటి నెలలో వ్రాసిన 'అనురాగ స్రవంతులు' కథలో సృష్టించిన 'సత్యానందం' అచ్చం తన భర్త లాంటి వాడేనని వ్రాసింది. అటువంటి కథలు ఎన్నో సృష్టించాలని నివేదించుకుంది. చూశావా? మహిళా లోకంలో మన పేరు ప్రతిష్ఠలు ఉజ్జ్వలమానంగా, దేదీప్య తేజంగా, శతకోటి విద్యుద్దీపాలులాగ...."

"సెమికోలన్.తర్వాత నేను మనస్సులోపూర్తిచేశాను"

"బయటకు చెపుతే అందరూ సంతోషిస్తారు."

"ఆడవాళ్ళ పేరు పెట్టి వ్రాసిన ఉత్తరాలు నిజమని నమ్ముతున్నారు. ఇంకానయం! మీ కథలను చూచి, మీ తెలివితేటలను చూచి ఆ అమ్మాయి మిమ్మల్నే ప్రేమిస్తాననలేదు."

"అటువంటివి కూడా వచ్చాయి."

"సరే! అయితే తిలోదకాలు ఇవ్వచ్చునన్నమాట."

"దేనికి?"

"దాంపత్యానికి."

"ఈ ఆడవాళ్ళకు బొత్తిగా బుర్రలు పనిచేయవు. తేలిగ్గా ప్రతి విషయాన్ని నమ్మేస్తారు. నీ మనస్తత్వాన్ని ఒక కథలో సృష్టిస్తేగాని..."

"అటువంటి పనులు చేస్తే, పరువునష్టపు దావా మా నాన్నచేత వేయిస్తాను."

"గెలిచేది ఎవరో తెలుసా ! మేము."

"కోర్టు కెక్కిన తర్వాత అన్నీ తెలుస్తాయి. అందర్నీ చంపినట్లు నన్నుకూడ మీరు కథలో చంపేస్తారు. నా తరఫున వాదించడానికి మరీ బలంగా ఉంటుంది."

ఈ రాత్రి కథ పూర్తిచేద్దామని అనుకుంటే, నా ప్రాణాలు కొరుక్కుతింటున్నావు. నీకు పుణ్యం ఉంటుంది గాని, కాస్సేపు మట్లాడకుండా కూర్చోకూడదూ ?"

"నేను కథ వ్రాయనివ్వను. అతన్ని చంపుతానంటే వ్రాసిన కాగితాల్ని చింపేస్తాను."

"అతన్ని చంపుతేనే నా కథకు పేరు వచ్చేది. తర్వాత నీ కీర్తి రూపొందేది."

"ఎట్లాగ చంపుతారో నేనూ చూస్తానుగా ?"

"అయితే ఎందుకు చంపవద్దంటున్నావు ?"

"అతడు చాల మంచివాడు. పేద ప్రజానీకానికి చాల సేవ చేశాడు. ఎంతో మందిని రక్షించాడు. పెన్నిధులు చేసే అమానుషాలను అరికట్టాడు. ప్రజ లతన్ని దేవుడుగా భావిస్తున్నారు. అటువంటి మహాత్ముణ్ణి చంపుతానంటా రేమిటి ?"

"చూశావా ! మన సస్పెన్సు ఎట్లా ఉందో ? అతన్ని నిజంగా నీవు ప్రేమిస్తున్నావు. నీవేకాదు. హృదయం ఉన్న ప్రతి ఆడది ప్రేమిస్తుంది. అయితే రామాన్ని చంపడంలేదు."

"కథ అడ్డం తిరిగిందా ?"

"దేవిగారి ఆజ్ఞ !"

"సుఖాంతంగా ముగిసిన కథ సుఖాన్నిస్తుంది."

"నిజం."

★ అనునయం ★

ఎందుకయ్యా భ్రమర
నీకింతనీటు ?
తామరాకులమాటు దాగినావిదియేల ?
ఎందుకయ్యా భ్రమర
నీకింతనీటు ?

మలయానిలాన దోహల నాట్యమునుమాని
చైత్రశోభాలసిత సంగీతమునుమాని
మా మల్లికను వీడి పద్మపత్రాచ్ఛాద
సమ్మనం దిటు దాగినావేల అళిరాజ ?
ఎందుకయ్యా భ్రమర
నీకింత నీటు ;

పరిహాసమా ? లేక చిరుకోపమా ? కాక
పరీరంభణ లేశ బాధా స్వరూపమా ?
మాటాడవిదియేమి ? నోటి ముత్తెములెల్ల
రాలునా ? ఈ కోపమేలనోయీ భ్రమర ?

ఎందుకయ్యా భ్రమర
నీకింత నీటు ?

క్రొందేనెలెల్ల నీకందీయ చేర్చినది
ప్రస్థపుష్ప పరీమళము నిండగూర్చినది
మామల్లి — నీకిన్కతో మాసిపోయినది
దానిని పరీక్షింప తగునటయ్యా బాబు ?
ఎందుకయ్యా భ్రమర
నీకింత నీటు ?

నీయుందె ఆసలన్నీ ప్రోవుచేసినది
తరితీపు లొక యింత తెలియజాలనిది మా
మల్లికాలలన ; నీపై పంచప్రాణాలు !
దాని నిటు వేచ, బావా, నీకు భావ్యమా ?
ఎందుకయ్యా భ్రమర
నీకింత నీటు ?

— పణతుల రామచంద్రయ్య.